# అన్నమయ్య పద సారస్వతం: నాట్యప్రస్తావన

- డాక్టర్. శొంఠి (సుసర్ల) శారదాపూర్ణ

అన్నమాచార్యుడు భాగవతతత్వమెఱిగిన జ్ఞాని. సంగీత సాహిత్య సారజ్ఞుడు. రసికుడు. శ్రీనివాసునియందు శరణాగతి నెఱపిన వైష్ణవభక్తుడు. భావస్వతంత్రుడు., బాషాస్వతంత్రుడు. పండిత పామరులకు కర్ణరసాయనంగా, హృద్యంగా దేశి కవితని , దేశిసంగీతాన్ని దేశినృత్యాలని ఏకం చేసి సంకీర్తనలని రచించిన చతురుడు. వివిధ రాగ భేదాలకి బహువిధ నాయికా నాయక భేదాలకి ఏక పక్ష సాక్ష్యాలుగా పదరచన చేసి లక్షణ గ్రంధం కూడా తానే చూపిన లాక్షణిక కవి అన్నమయ్య.

అన్నమాచార్యునిది మధుర పద్ధతి. ప్రతి జీవాత్మ స్త్రీ అని (లేదా రాధ అని గోపిక అని నాయిక అనీ) ఈ స్త్రీ లందరూ లేదా జీవాత్మలన్నీ పరమాత్మను చేరడానికై యోగమార్గం అవలంబిస్తారనీ, జీవులందరికీ లేదా స్త్రీమూర్తులందరికీ పరమపురుషుడు ఏక నాయకుడు అయిన భగవానుడు భర్త అనీ మధురపద్ధతి తాత్పర్యం. ఈ స్వామి శ్రీకృష్ణుడు. జీవుడు రాధ. ఈ రాధా కృష్ణ తత్వం మధుర భావ మిళితం. అలౌకిక శృంగార సంవేద్యం. తన సౌందర్యం తో అలరించి గానం తో మురిపించి, నాట్యంతో మరిపించి తనను తాను సమర్పించుకుంటుంది జీవనాయిక. ఈ యోగం లో శృంగారం అతి మధురం. ప్రేమలో ఆధ్యాత్మికతత్వం నిండి ఉంటుంది. ఆద్యంతం శృంగారం పొంగువారుతున్నా మిగిలే భావం భక్తి, ఆత్మార్పణ భావం శృంగారం లోని ఆధ్యాత్మ తత్వాన్ని, ఆత్మతత్వాన్నీ మధురభక్తిగా పేర్కొనవచ్చు. ఈ మధుర భక్తి తత్వం ఆ ధారంగా వచ్చిన సారస్వతం లో ప్రధానాంశం శృంగారం. అది అలౌకికం. వర్ణనలు, కల్పనలు, భావనలు ఈ శృంగార రసరాజ భరితాలే. ప్రేమ యొక్క ఆర్ద్రతని చూపించేవే ఈ మధుర భక్తి పదాలు.

తిరుమల వాసుని యందు భక్తి నెఱపి అక్షరార్చన చేసి, కీర్తించి, నర్తించి అన్నమాచార్యుడు భగవంతునిపై అనురక్తి సాధించేడు. తనను తాను శ్రీనివాసుని దేవేరి అలమేలు మంగగా భావించుకున్నాడు. సంకీర్తనలు వ్రాసేడు. నృత్య సంగీత లలిత కళల రహస్యాలు చొప్పించి మధుర రచనలు చేసిన కళాస్రష్ట. సాహిత్య శుద్ధి కలిగి, భావం తెలిసి, రాగస్వరూపం నృత్య విన్యాసపు లోతుల నెఱిగి పురందరదాసు, క్షేత్రయ్య, సిద్ధేంద్ర యోగి, రామదాస, త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలకి మాతృకలనదగిన సారస్వతం సృష్టించినవాడన్నమయ్య. లలిత కళలని ఆధునిక దృక్పథం తో చూస్తే గీతం వాద్యంతో చేరి సంగీతమైంది. ప్రాచీనుల మతం అది కాదు. నృత్యం, గీతం, వాద్యం చేరిస్తే కానీ సంగీతం కాదు. అది ప్రధానంగా శృంగార కరుణ రసాలతో కూడి ఉంటుంది. కోమల కరణ అంగ విక్షేపం తో సాత్విక భావ ప్రకటనతో, ఆనంద జనకమై, మధుర లాస్య నర్తనోపేతమై రసానుభూతి కలిగించేదై ఉంటుంది. ఈ రసజ్ఞత అన్నమాచార్యునికి పరిపూర్ణంగా ఉందనీ, వారి పదసారస్వతం ఆటపాటలకు అభినయానికీ సమర్ధత కలదనీ చెప్పడానికి అన్నమయ్య సంకీర్తనలే ఆధారం. అవి ఆధ్యాత్మ, శృంగార తత్వపు లోతులని విదితం చేస్తాయి.

వర్ణన సాహిత్యాంశంగా రచనలు సాగించేడు అన్నమయ్య. "రమణీయార్ధ ప్రతిపాదక: శబ్ద: కావ్యం" అని జగన్నాధుని నిర్వచనం. అన్నమాచార్యుని సంకీర్తనలన్నీ రమణీయార్ధ ప్రతిపాదకాలైన వర్ణనలతో కూడినవి. అంగరంగ వైభోగ ప్రియుడైన వేంకటేశ్వరుని మీద ప్రీతిని నవవిధభక్తితో సేవించి అనుభవించి చాటేడు. హృదయగంధి విచ్ఛేదం చేసి సత్యమూ పరమూ అయిన బ్రహ్మానందాన్ని సాక్షాత్కరింప చేయడంలో, హృదయాలను స్పృశించి, మధించి, పరవశింపచేసే నృత్య సంగీతాది కళలు అత్యుత్తమాలని గ్రహించి తాను చేయదలచిన అక్షరార్చనకి లలితమైన హృద్యమైన కళలని పూజాపుష్పాలుగా చేసాడు. సకళకళలకి మూలద్రవ్యం భావం. ఈతనిలోని భావం అపూర్వం, అద్వితీయం, అలౌకికం. తన క్రియా కలాపానికి గాను స్వీకరించిన ఉపకరణం విలక్షణమైనది. కనుక కళావైవిధ్యానికీ, భావావిష్కరణకీ కారణమై మనోజ్ఞమైన సారస్వతంగా ప్రతిఫలించింది. కళావిలసనలో చిద్విశిష్టమైన స్థాయి రసం ఆ ఆలంబన, స్థాయికి ఉపమితమైన చిత్తం అన్నమార్యునిది.

అన్నమాచార్యునికి సంగీత శాస్త్రం లో గల ప్రావీణ్యం, నృత్యశాస్త్రం లో గల అభినివేశం ఎంత లోతైనదో కొలిచి చెప్పగలవి వారి సంకీర్తనలు. అన్నమాచార్యుని దివ్యనాయిక సంపూర్ణ స్త్రీ. ఆమె దివ్య మంగళ మూర్తి. ఆమె జీవనాయిక ప్రకృతి.

ఈ భావుకుని నాయిక, "హరిని కరగింపుచు అరతెర మరుగున" ఆడినది. "అందెల మోతల అందపు తిరు పుల చిందుల పాటల శిరిపాలయాటలు" నర్తించింది. "మట్టపు మలపుల మట్టెల కెలపుల తట్టడి నడపుల" లాస్యం చేసింది. "కిన్నెర వన్నెలుగ వీధి వీధి

వాయించగా" ఆడింది. "కలికి చూపుల మొలక నగవుల/ బలుపు పిలుపుల పచ్చి చూపుల/ వెచ్చనూర్పుల దంటు మాటల/ గొంటు చేతల కింక తమకముల " విరహంతో శృంగారభావాలు చూపింది. "అన్ని జాతులు దానెయ్యై" నర్తించిన మగువ. కిన్నెర మీటుచు మంచి సన్నపు నడపు తో సాగిన తరుణి. "గద్దలింపు కులుకుల కొనవంక చూపుల మురిపెముల లేతమాటల గబ్బి చూపుకన్నుల అద్దలించ చూపుల" విభుని మురిపించిన ప్రౌఢ. "గిలుకు మట్టెతోడ కిందిచూపులతో సెలవి నవ్వుల తోడ" స్వామి నలరించిన ముగ్ధ. "గిలుకుకంకణముల కీరవాణి కిన్నెరలో కులికేటి" ఆటగత్తె. "కంచు మట్టియలు రవంబులు గజిబజింప పదము తాటించి గబ్బి నడపు" నడచేటి నర్తకి. "మొల చిరుగంటలు మువ్వలు గజ్జెలు ఘులఘుల మనగా కదిలే" జవ్వని. "వేడుకతో సంగీతము విని కన్నుల మెచ్చుచు ఆడుచు నుండే" రసహృదయిని. "సళుపు చూపుల "మోహపు కయ్యముల" అళుకు కసరుల కన్నుల జంకెనల" ఖండిత. "కుందనంపు మట్టెల మోతలతో అందెలతో జగడించ" అందమైన కోమలి. "హరియంతరంగ కలిత నాట్యరంగ కరుణాపాంగ" అలమేలు మంగ. "చెలికత్తెలతో తాను కనకపు మట్టెలు కణంగని వాగ మినుకుల పట్టు చీర మేలిముసుగులో ముత్తేల కంకణాలు మొరమొర వాగ" ఆడింది.

అన్నమార్యుని అంగనలందరూ "ఘల్లుఘల్లుమని కంకణ రవముల/అల్లన నడుములు అసియాడుచును" నర్తించేరు. "ధిమ్మి ధిమ్మి ధిమ్మనుచు ఘుల్లు ఘుల్లు ఘుల్లు ఘుల్లనుచు" ఆడేరు. "పాదంపు చెండేలు మ్రోయ బడతులిరు వంకల చెప్పరాని నటనల" ఆడేరు.

కన్నెపాయపు సతిని పల్లకిని ఎత్తిన అంగలను అన్నమయ్య, "కులుకగ నడవరో ఒప్పగ నడవరో మైజారి నిలువరో చెమ్మాళిగనిడరో" అని మందలించేడు. "ప్రతినలతో రంభయు మేనకయు అతివలు నాట్యంబాడెదమని గానవిద్యా" తమకంబున ఆడేరు. "పాడవే సోబానాలు పైపైనే పేరంటాండ్లు జడతో వాయించరే పంచమహావాయిద్యాలు" అని ఆదేశించాడు. "అంగన పాదంబుల అందెలు మట్టెలునె కంకణ సూడిగములే మొలనూలి గంటలు" అని అభివర్ణించేడు. "దివ్యదుందుభులు మ్రోసే దేవకామిను లాడరో" అని అర్థించేడు. అంగరంగవైభవాల అమరకామినులాడ సంగీత తాళ్వద్య చతురతలు మొరయగ సంగతిగ పాడేరని" చిత్తజగురునికి తెలిపేడు.

అన్నమార్యుని బాలకృష్ణుడు కూడా నాట్యపు మెలకువలు తెలిసిన వాడే "పాదపు గజ్జెలు మ్రోయ పండరంగి రాయడై" ఆడేడు. "బింకపు మోతల పిల్లగ్రోవివాడు చేమపూ కడియాల చేయి బెట్టి ముంగై మురుపుల చేయి బెట్టి చెప్పరాని ఉంగరాల చేయి పెట్టి" ముద్దులాడే బాలుడు. "ఫెళ్ళు, కతిల్లు, పెతిల్లు జతిల్లని, అంగు కళింగు కఠింగు ఖణింగని" ఆడేటివాడు.

అన్నమయ్య ఒక్కొక్క సంకీర్తన ఒక్కొక్క ప్రబంధం. విలక్షణంగా వర్ణన సాగిందా కృతుల్లో. ఒక ఉత్తమ కావ్యాన్ని చదువుతున్నప్పుడో, ఉత్తమ దృశ్యకావ్యాన్ని చూస్తున్నప్పుడో రసానుభూతి కలుగుతుందనేది సామాన్యవాదం. ఒక ఉత్తమ చిత్రాన్ని చూసినా, మధురమైన గీతాన్ని విన్నా, మనోహర శిల్పాన్ని చూసినా చిత్తద్రుతి కలుగక మానదు. చిత్తద్రుతీకరణ యోగ్యమైన మనసు ఈ రసోదయానికి ఆలంబన. ఒకవేళ వస్తువు సహజ సుందరం కాకపోతే భావుకుని చేత భావ్య మానమైనపుడు తదంతర్గతమైన సౌందర్యం కవికే కాక కవితద్వారా సామాజికునికి కూడా అందుతుంది. సామాన్య మానవుని భావసంస్కారం కంటే కవి అయిన భావుకుని భావసంస్కారం అపురూపమైనది. ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసముల చేత రసజ్ఞుడు అలౌకికానందం అనుభవింపగలడు. అనుభవింప జేయగలడు. అణువును బ్రహ్మాండం చేయగలడు. బ్రహ్మాండాన్ని పిడికిట పట్టి చూపగలడు. అన్నమార్యుడీ కోవలోనివాడు. భావుకుడైనందువల్లనే తన నాయికా నాయకులని "మెఱుపు మేఘము గూడి మెరసినట్లు"గా చూసేడు. తన నాయిక చేత "ప్రేమమే దేవతాప్రీతిగా కామయాగం" చేయించేడు. భగవంతునితో అనేక విధాలైన సంబంధాలేర్పరచుకొన్నాడు. తానే నాయిక అయి భగవంతుని మీది అనురక్తితో సంయోగ వియోగాలను అనుభవించేడు. "తెగని పరిణతులతో జగదేకపతి మనసు జట్టిగొ"న్నాడు. తాను చెలికత్తె అయి "ఏమొకొ చిగురుటధరమున ఎడనెడ కస్తూరి నిండెను,. బామిని విభునికి వ్రాసిన పత్రిక కాదు కదా"అని పరిహాసమాడేడు. కొన్నివేళల తాను తల్లియై "ఇట్టి ముద్దులాడే బాలుడేటి వాడే వాని పట్టి తెచ్చి పొట్టనిండ పాలు పోయరే"అని వాత్సల్యం నెఱపేడు. మరికొన్ని వేళల్లో "రతులకు మా ఇంటికి రారా గొల్లడు" అని ఆహ్వానించే గొల్ల గోప స్త్రీ అయ్యేడు. "మేలు భూమికి జెప్పేవా ఇంకా యెరికత నీవు మేలుకు జెప్పేవుటే మిండ యెరికత నీవు" అని ప్రశ్నించేడు. అమాయకుడైన నాయకుని తోడ్కొని పోయే ఎఱుకతగా మారేడు. "చిగురు బయ్యెద యేలే చెంచెత నీకు"అని చెంచెత అయి స్వామి చేత పరిహాసాలందుకున్నాడు. "ఏలే

యేలే మరదలా చాలు జాలు నీ తోడి సరసాలు బావా" తాను మరదలై వేంకట పతిని గూడేడు. అన్నమాచార్యుడు తాను ఏక నాయిక యై భిన్న జాతుల స్త్రీల లక్షణాలని తనలో సమన్వయం చేసుకున్నాడు. నాయికల సర్వావస్థలు తాను అనుభవించేడు. శ్రీ వేంకటేశ్వరుని దక్షిణ నాయకత్వం కూడా అన్నమాచార్యుడు వర్ణించి తరించేడు. "ఒక్కొక్క సతి నడుమ నొక్కొక్క రూపు గైకొని యెక్కువైతి కృష్ణా నిన్నెట్లు నమ్మేదిరా" అంటూ మగువల నడుమనున్న మురారిని మనోహరంగా చూపేడు. "ఒకపరికొకపరి కొయ్యారమై మొకమున కళలెల్ల మొలచినట్లు" గోచరించిన శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళ రూపాన్ని, దేవుని అనంత కళ్యాణ గుణవిభవాలని సంకీర్తనలుగా మలిచేడు. తన శృంగారభావాన్ని భగవన్నిష్ఠం చేసి ఆత్మాశ్రయరీతిలో రచన సాగించేడు. దివ్యదంపతుల ప్రణయాన్ని, అలౌకిక శృంగారాన్ని మనోజ్ఞంగా రూపొందించి, స్త్రీ హృదయానికి చెందిన సర్వావస్థలలోని, సర్వ స్త్రీ జాతులలోని ప్రణయభావాన్ని తానే అనుభవించి రసవత్తరంగా నర్తించేడు. గానంచేసేడు. వర్ణన చేసేడు. ప్రతి కీర్తనా విలక్షణంగా రచించి, వర్ణనామయం చేసి, రసభరితం చేసి ప్రబంధ నర్తనం చేసేడు.

(ఈ వ్యాసం శొంఠి శారదాపూర్ణ గారి "తాళ్ళపాక అన్నమాచార్యుని సంగీత నృత్య కళాభిజ్ఞత" నుండి సంగ్రహించబడినది).